ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 19 మే 2025





బహుదూరపు బాటసారులు



బతుకు పోరాటంలో వీరు బహుదూరపు బాటసారులు.. మూగజీవాలను వెంట వేసుకొని వందల కిలోమీటర్లు పయనమైన సంచార జీవులు.. జీవాల మేత కోసం నారాయణపేట జిల్లా నుంచి గొర్ల మందలతో కొడంగల్ మీదుగా దుద్యాల చేరుకున్నారు. ఈ క్రమంలో కడుపు నింపుకోవడానికి రాత్రుళ్లు మందలు పెడుతూ.. కుటుంబ అవసరాలకు జీవాలను అమ్ముకొని ముందుకు సాగుతున్నారు. ఎండైనా, వానైనా కులవృత్తిని వదులుకోకుండా జీవాలను కాపాడుకుంటామని, వీటి కోసం ఎంతదూరమైన పోతామని గొర్ల కాపరులు పేర్కొంటున్నారు. వేసవి ఆరంభంలో ఊరి నుంచి బయటకు వచ్చి, మళ్లీ తొలకరి జల్లులు పడినప్పుడే ఇళ్లకు చేరుతామని, ఈ మధ్య కాలంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

- దుద్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి)

పట్టించుకోరా?



అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ఇబ్బందులుగా మారాయి. తాండూరులోని ప్రధానమైన రెండు ఆస్పత్రుల దారిని సూచించే బోర్డులను పడేశారు. దీంతో ఆస్పత్రులు ఎక్కడ ఉన్నాయో తెలియక రోగులు, బంధువులు అయోమయంతో ఇతరులను అడిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పొరపాటు జిల్లా ఆస్పత్రి అధికారులదా, లేక మున్సిపల్ అధికారులదో తెలియదు కానీ, బోర్డులను మాత్రం పది రోజుల కింద పడేశారు. తాండూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని మున్సిపాలిటీ డివైడర్ గ్రీనరీలో ఉన్న తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి బోర్డు, రాయల్ కంట సమీపంలో రోడ్డు పక్కన ఒక గోడకు హైదరాబాద్‌లోని మాతా శిశు ఆరోగ్య ఆస్పత్రి బోర్డును వదిలేశారు. ఈ యారో మార్కులు చూచి జనాలు తికమకపడుతున్నారు. అధికారులు సమస్యను గుర్తించి బోర్డులను తిరిగి పాతేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాండూరు, మే 18 (ఆంధ్రజ్యోతి)

పొద్దంతా ఎండ.. సాయంత్రం వాన

» ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

వికారాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం వరకు భానుడు భగ్గుమన్నాడు. తర్వాత జిల్లా కేంద్రంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పూర్తిగా మేఘావృతమైన వాతావరణం ఒక్కసారిగా చిరుజల్లులతో మొదలై భారీ వర్షంగా మారింది. దీంతో రోడ్లపై వరద నీరు ప్రవహించగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కావడంతో రైతు బజార్‌కు వచ్చిన రైతులు సైతం కూరగాయలు అమ్మేందుకు అవస్థలు పడ్డారు. వర్షం వస్తే చాలు రైతు బజార్ చిత్తడిగా మారతుందని, ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.





బొడ్రాయికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

ఘట్‌కేసర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మహిళా భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బొడ్రాయి ప్రతిష్ఠించి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది. దీంతో పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కొత్త రాగి చెంబులతో బొడ్రాయిపై నీళ్లు పోశారు. ప్రతి ఒక్కరూ రాగి చెంబులు, రాగి బిందెలు కొనుగోలు చేయడంతో వ్యాపారులు భారీగా ధరలు పెంచారని పలువురు మహిళలు ఆరోపించారు.

రుణ లక్ష్యం



₹553.45 కోట్లు

'స్వయం'గా ఎదిగేలా మహిళా సంఘాలకు లోన్లు

స్వయం సహాయక సంఘాల వివరాలు

మొత్తం సంఘాలు
16,048
సభ్యులు
1,63,621
2025-26లో రుణ లక్ష్యం
రూ.553.45 కోట్లు
ప్రతిపాదించిన సంఘాలు
12,616
పంపిణీ చేసిన రుణాలు
రూ.29.88 కోట్లు
రుణాలు పొందిన సంఘాలు
296



- రికవరీ ఆధారంగా రూ.20 లక్షల వరకు మంజూరు
- మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పంపిణీ
- వ్యక్తిగతంగానూ రుణం పొందే అవకాశం
- గతేడాది 98.45 శాతం రుణ లక్ష్యం పూర్తి
- ఈ ఏడాది వంద శాతం అందించేలా చర్యలు

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందిస్తోంది. ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం ఖరారు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 12,616 స్వయం సహాయక సంఘాలకు రూ.553.45 కోట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలోని 296 సంఘాలకు రూ.29.88 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేసి నిర్దేశించిన రుణ పంపిణీ లక్ష్యం 5.40 శాతం చేరుకుంది. జిల్లాలో 16,048 స్వయం సహాయక సంఘాలు కొనసాగుతుండగా, ఈ సంఘాల్లో 1,63,621 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. అర్హత కలిగిన సంఘాల్లో ఒక్కోదానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నారు.



వికారాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసే వ్యాపారాల ఆధారంగా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. చిన్న, కుటీర పరిశ్రమలు, కిరాణ, జనరల్ స్టోర్స్ పిండిగిర్ని, టైలరింగ్, తదితర వ్యాపారాల కోసం సభ్యులు ఎక్కువగా రుణాలు తీసుకుంటున్నారు. ఇంతకుముందు తీసుకున్న రుణాల్లో రికవరీ సక్రమంగా ఉన్న మహిళా సంఘాలకు

మిగతా 8వ పేజీలో...



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కీసర,మే18(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ ఈటల రాజేందర్ పంపిణీ చేశారు. ఇటీవల కసపాక సోనీ, పాలకూరు గాయత్రీసూర్యప్రభ అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సోనీకి మంజూరైన రూ.37,500, సూర్యప్రభకు మంజూరైన రూ.21,500 విలువైన చెక్కులను ఆదివారం ఎంపీ ఈటల లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





బషీరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు

అరకొరగా గన్నీ బ్యాగులు

బషీరాబాద్ మండలంలో ఈ ఏడాది యాసంగిలో 3,600 ఎకరాల్లో వరి సాగు చేశారు. అంచనాకు మించి ధాన్యం దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మైల్వార్, దామర్‌చెడ్, బషీరాబాద్‌లో కేంద్రాలు ఏర్పాటు కాగా ఐకేపీ ఆధ్వర్యంలో కాశీంపూర్‌లో ఒకటి ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు సకాలంలో ప్రారంభించినా హమాలీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు పక్షం రోజులపాటు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు మూడు రోజుల కిందట హమాలీలు రావడంతో తూకాలు మొదలుపెట్టారు.

అన్నదాతకు అకాల కష్టాలు



బొంరాస్‌పేట్: తడిసిన ధాన్యం వద్ద రైతు

లారీలు రాక.. వడ్లు అమ్ముడుపోక

- వర్షాలకు తడిసిన బస్తాలు, ధాన్యపు రాశులు
- తూకం వేసినా ధాన్యాన్ని తరలించని వైనం
- కొనుగోలు కేంద్రాల్లో తప్పని అగచాట్లు
- రైతులను వెంటాడుతున్న వరుణుడు

బొంరాస్‌పేట్/బషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. లారీలు రాకపోవడం.. గన్నీ బ్యాగులు సరిగా లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యపు రాశులు పేరుకుపోతున్నాయి. తరుచూ వస్తున్న వర్షాలతో వడ్లను కాపాడుకోలేక రైతులు అగచాట్లు పడుతున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొంటారో, లేదోనని ఆందోళన చెందుతున్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతోపాటు మెట్లకుంటలో గన్నీ బ్యాగులు లేక కొనుగోళ్లు నిలిచిపోగా శనివారం సాయంత్రం బొంరాస్‌పేట్‌కు గన్నీ బ్యాగులు వచ్చాయి. అప్పటికే దాదాపు 5 నుంచి 6 వేల బస్తాలు

మిగతా 8వ పేజీలో...

ప్రైవేటుకు దీటుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం వినూత్న ప్రచారం

మేడ్చల్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): 'ప్రియమైన తల్లిదండ్రులారా.. మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి.. ఫీజుల భారం నుంచి విముక్తి పొందండి' అంటూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బోర్డు పాతి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లకు ఆహ్వానం పలుకుతున్నారు మండలంలోని నూతన్‌కల్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అందులో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి పేర్కొన్నారు.





కండ్లకోయ వద్ద గేట్ వే ఐటీ పార్కు కోసం కేటాయించిన స్థలం

ఐటీ పార్కుకు పునాది పడేనా?

శంకుస్థాపన చేసి మూడేళ్లు..

- ఇప్పటికీ ఇటుక కూడా పెట్టని వైనం
- తరలిపోతుందేమోనని ఆందోళన
- కండ్లకోయ గేట్ వే ఐటీ పార్కు దుస్థితి



మేడ్చల్, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వారం రోజులు హడావుడి చేశారు.. పటిష్ఠంగా ఉన్న గోదాములను స్ర్కాప్‌కు కూడా నోచుకోకుండా జేసీబీలతో రాత్రికి రాత్రే కూల్చివేశారు.. పనులు ప్రారంభం కాకముందే మేడ్చల్ రూపురేఖలు మారిపోనున్నాయని మాయ చేశారు.. తీరా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది మేడ్చల్ జిల్లా కండ్లకోయ గేట్ వే ఐటీ పార్కు పరిస్థితి. ఐటీ పార్కు ఏర్పాటుతో మేడ్చల్ ప్రాంతం ఏదో అయిపోతుందన్నట్లుగా అప్పట్లో అధికార పార్టీ నేతలు హడావుడి చేశారు. మూడు సంవత్సరాల క్రితం ఉన్న గోదాములను కూలగొట్టి భూమి చదును చేసి అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఐటీ పార్కు ఏర్పాటు అవుతుందని భూముల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. అప్పటి నుంచి కనీసం అడుగు స్థలంలో

మిగతా 8వ పేజీలో...

'ఇష్టానుసారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు'

కందుకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎగిరిశెట్టి రాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బాచుపల్లిలో ఇండ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన వారికే తప్ప.. అర్హులకు ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో ఎస్సీలకు 10, ఓసీలకు 2, బీసీలకు ఒకటి మంజూరు చేయగా కత్తుల నారమ్మ, కుమ్మరి అంజయ్యలకు గుడిసె ఉన్నా ఇల్లు మంజూరు చేయలేదన్నారు.

కాలనీల్లో కుక్కల బెడద

- ఆమనగల్లు మున్సిపాలిటీ వీధుల్లో స్వైర విహారం
- చిన్నారులపై తరచూ గ్రామ సింహాల దాడులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, నాయకులు



ఉదయ్‌నగర్ కాలనీలో తిరుగుతున్న కుక్కలు



కుక్కకాటుకు గురైన బాలుడు రియాజ్(ఫైల్)



ఆమనగల్లు ఆదర్శనగర్ కాలనీలో కుక్కల గుంపు

ఆమనగల్లు, మే 18(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లు మున్సిపాలిటీలో కుక్కలు స్వైర విహా రం చేస్తున్నాయి. కాలనీల్లో కుక్కలు గుంపు లుగా తిరుగుతూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. అంతర్గత రోడ్లపై, ఇళ్ల వద్ద కుక్కలు సంచరిస్తూ కొన్నిసార్లు మీదపడి కరుస్తున్నాయి. కుక్కల సంచారంతో బయటకు వెళ్లాలంటే చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు. రోజూ ఏదో ఓ కాలనీలో కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కల నియంత్రించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి 15వార్డుల్లో కుక్కల బెడదతో నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయ్‌నగర్ కాలనీలో కుక్కలు గంపులుగా తిరుగుతున్నాయి. వాటి భయంతో రోడ్డుపైకి వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. ఆదర్శ నగర్ కాలనీలో సోమవారం రాత్రి రియాజ్‌ఖాన్ అనే బాలుడు కుక్కల దాడితో తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటి ముందు పిల్లలు ఆడుకుంటే కుక్కలు ఎక్కడ దాడులు చేస్తాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సెలవుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆడుకోవాలంటే భయపడుతున్నారు. కుక్కలు వాహనదారుల వెంటపడి తరుముతున్నాయి. దీంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. కుక్కలు తరమడంతో వాహనాలపైనుంచి పడిపోయి గాయపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లలేకపోతున్నాం



కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి. కాలనీల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వాటి భయంతో మేం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. పిల్లలపై కుక్కలు తరచూ దాడిచేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు కుక్కలను వేరేచోటికి తరలించాలి.

- ఫరీద్, ఆదర్శనగర్ కాలనీ, ఆమనగల్లు

సమస్యను పరిష్కరిస్తాం



కుక్కల బెడద నివారణ కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వీలైనంత త్వరగా కుక్కల నివారణకు తగిన చర్యలు చేపడతాం. సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తాం. ప్రజలు తినుపదార్థాలు, వ్యర్థాలను కాలనీల రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలి.

- శంకర్‌నాయక్, కమిషనర్, ఆమనగల్లు మున్సిపాలిటీ

ఉత్తమ కోర్సులను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న విద్యావేత్త రామకృష్ణ

తాండూరు, మే 18(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు భవిష్యత్తు దృష్ట్యా ఉత్తమ కోర్సులను ఎంచుకోవాలని విద్యావేత్త పర్వేద రామకృష్ణ సూచించారు. ఆదివారం తాండూరు పట్టణం చైతన్య జూనియర్ కళాశాలలో హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని సూచనలు చేశారు. ఇంటర్ తర్వాత భవిష్యత్తును, ఉపాధినిచ్చే కోర్సులను ఎంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ధార్మిక పరిషత్ కో-కన్వీనర్ నరేందర్, సభ్యులు పటేల్ విజయ్‌కుమార్, ఓంప్రకాశ్ సోమాని, చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ జగ్జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన బీర్ల డిమాండ్

- ధరల పెంపుతో తగ్గిన అమ్మకాలు



పేట్‌బషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. వేసవి తాపానికి జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని ప్రదేశాలు, పానియాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మందుబాబులైతే ఎండ నుంచి సేద దీరేందుకు చల్లని బీర్లు తాగేందుకు ఇష్టపడతారు. మిగతా కాలాలతో పోలిస్తే వేసవిలో బీర్ల వినియోగం అధికంగా ఉంటుంది. ప్రతీ ఏటా బీర్లకు డిమాండ్ పెరుగుతోంది. అయితే గత రెండు నెలలుగా మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో బీర్ల అమ్మకాలు తగ్గాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే ఈ సంవత్సరం బీర్ల అమ్మకాలు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాధరణంగా విస్కీ, బ్రాందీ లిక్కర్‌ను తాగే వారు సైతం ఈ వేసవిలో చల్లబడేందుకు బీర్లు తాగుతారు. అయితే మద్యం రేట్లు పెరగడంతో బీర్ల అమ్మకాలు తగ్గినట్టు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో మూడు ఎక్సైజ్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటిల్లో మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. ఈ కార్యాలయాల పరిధిలో 114 మద్యం షాపులు, 95 బార్లు, 52 కో-ఆపరేటివ్ సొసైటీలు, 44 టీపీటీ షాపులు ఉన్నాయి. 2024లో మార్చిలో బీర్లు 3,45,287 కేసులు, ఏప్రిల్‌లో 3,38,473 కేసుల చొప్పున వైన్స్‌ల నిర్వాహకులు విక్రయించారు. అలాగే 2025 మార్చిలో 2,05,599 కేసులు, ఏప్రిల్‌లో 3,03,299 కేసుల అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. 2024 మార్చి, 2025మార్చి బీరు కేసుల అమ్మకాల్లో తేడా 1,39,688 ఉందని అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 10శాతం బీర్ల విక్రయాలు పడిపోయాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ కొంత పడిపోవడం, బీర్ బాటిల్ ధర రూ.20 నుంచి 30వరకు పెరగడం, కొన్ని సమయాల్లో వాతావరణం చల్లబడడం వంటివి కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. మే నెలాంతానికి బీర్ల అమ్మకాలు పుంజుకోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

స్వయంభూ శివాలయంలో చోరీ



ఆలయం వద్ద మాట్లాడుతున్న సూదిని పద్మారెడ్డి, గ్రామస్తులు

మాడ్గుల, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద మాడ్గులలో ఉన్న పురాతన స్వయంభూ శివాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి గ్రామపెద్దలకు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న శివాలయ వ్యవస్థాకులు, సీఎం రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి ఆలయానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం అర్ధరాత్రి దొంగలు మొదట ఆలయ తాళాలను, అనంతరం రెండు హుండీలను మిషన్‌తో కట్ చేశారని తెలిపారు. హుండీల్లో ఉన్న రూ.50వేలు, వెండి ఆభరణాలను అపహరించారని చెప్పారు. దొంగలను పట్టుకొని దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని ఆయన పోలీసులను కోరారు. పద్మారెడ్డి ఆలయం వద్ద నుంచే సీఐ వేణుగోపాల్‌రావుకు ఫోన్ చేశారు. తాను ఆర్కపల్లి బీరప్ప పండుగలో ఉన్నానని ఆయన నిర్లక్ష్యంగా మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, గ్రామస్తులు ఆరోపించారు. ఆలయంలో చోరీ జరిందని తెలిపినా పోలీసులు రాకపోవడంలో అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. కొద్ది సమయం తరువాత సీఐ స్పందిస్తూ.. శివాలయంలో చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని గ్రామస్తులకు తెలిపారు. ఆలయాన్ని పరిశీలించిన వారిలో ఆలయ కోశాధికారి కల్లు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, విష్ణు, మిద్దె రాములు, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

నాట్య మయూరి హన్వితరెడ్డి

- స్వర్ణగిరిలో అబ్బురపరిచిన చిన్నారి



నాట్యం చేస్తున్న హన్విత

చౌదరిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన మంగన్నగారి అనూష, రాజశేఖరెడ్డిల కుమార్తె హన్వితరెడ్డి షాద్‌నగర్‌లోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. వర్ష కల్చరల్ అకాడమీలో నాట్యం నేర్చుకుంటోంది. శనివారం భువగిరి జిల్లా స్వర్ణగిరి ఆలయంలో నిర్వహించిన శ్రీ మయూరి నాటక కళాస్థాపన శ్రీనివాస నృత్య నీరాజనం 2025లో హన్విత నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. బాలిక పురస్కారం అందుకుంది. నాట్యంలోని కదలికలను చిన్నారి అవలీలగా చేస్తూ అభినయిస్తోంటే చూసిన వారంతా చప్పట్లతో అభినందనలు తెలిపారు.

చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా



మున్సిపాలిటీ పెట్టిన ఫ్లెక్సీ

తాండూరు, మే 18 (ఆంధ్రజ్యోతి):ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో మున్సిపల్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు మారడం లేదు. దీంతో మున్సిపల్ జవాన్లు పలు ప్రాంతాల్లో ఆదివారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'ఇచ్చట చెత్త వేయరాదు.. వేస్తే వెయ్యిరూపాయల జరిమానా' అని రాశారు. వీవీహెచ్ఎస్-శివాజీచౌక్ రోడ్డులో, సుచిత్ర బార్ సమీపంలో మున్సిపల్ కమిషనర్ పేరిట ఈ ఫ్లెక్సీలుపెట్టారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారం రోడ్లు, నిషేధిత ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని జవాన్లు అవగాహన కల్పిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

యాలాల, మే 18(ఆంధ్రజ్యోతి):యాలాల మండలం అగ్గనూరులో శనివారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరేశం తండ్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం అగ్గనూరు గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమప్ప, మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు



రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు


కులకచర్ల, మే 18(ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని, ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు తరలించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్, కులకచర్ల, కుసుమ సముద్రం గ్రామాల్లో ఆదివారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నట్టు చెప్పారు. లారీల కొరత లేకుండా చూస్తామన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. కాంట వేసిన వారం రోజుల్లో డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. ఆదివారం మండల పరిధి చందనవెళ్లిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలతో నివాళులర్పించారు. స్వామి మాట్లాడుతూ.. చందనవెళ్లిలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు యాదయ్య, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వడ్ల రాఘవచారి, మహిపాల్‌రెడ్డి, కిష్టయ్య, మహ్మద్ యూనిస్, మండల నాయకులు వెంకటేశ్, మల్లేష్, శ్రీహరి, ప్రవీణ్, శ్రీకాంత్, యాదయ్య, పుష్పమ్మ, లక్ష్మమ్మ, శ్రీశైలం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



చందనవెళ్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సుంకిరెడ్డి కృష్ణారెడ్డి

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఆమనగల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా తోడ్పాటునందిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు తమ వంతు పాలుపంచుకోవాలని ఆయన కోరారు. ఆదివారం భగత్ సింగ్ తండాలో నిర్వహించిన శ్రీ మేరామాయాడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.2లక్షల విరాళం అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు అభినందించారు. కృష్ణారెడ్డిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని గడుపుతారని అన్నారు. ఫౌండేషన్ సేవలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని అన్నారు. నిర్వాహకులు రాజునాయక్, భీమ్లా, హర్య, బాలు, దేవేందర్, రాజేందర్, లచ్చు, పవన్, గౌరి, నరేందర్ పాల్గొన్నారు.



లింగంపల్లి కాంగ్రెస్ కమిటీ, నాయకులు

కాంగ్రెస్, టీడీపీ గ్రామ కమిటీలు

మంచాల, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామ కాంగ్రెస్‌కు నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు వింజమూరి రామ్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ఎ.జంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా పెరిక భూపాల్, పంతంగి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగంయాదవ్, జాయింట్ సెక్రటరీగా నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా మైసయ్య, వినోద్, గణేష్‌లను ఎన్నుకున్నట్లు ఆదివారం తెలిపారు. అదే విధంగా టీడీపీ చెన్నారెడ్డిగూడ కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు ఆకుల శంకరయ్య తెలిపారు. అధ్యక్షుడిగా చీమల వేణు, ఉపాధ్యక్షుడిగా హరియా, ప్రధాన కార్యదర్శిగా ఆర్. జవహర్‌లాల్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా రవి, శ్రీశైలంయాదవ్, రాములు, కార్యదర్శులుగా కోటియా, కోశాధికారులుగా దేవ, రాములు, సభ్యులుగా పాండు తదితరులను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



ప్రచార రథానికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడ్తాల్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా నాయకులు జవహర్ నాయక్, హీరాసింగ్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆధ్వర్యంలో తయారు చేయించిన ప్రభుత్వ పథకాల ప్రచార రథానికి కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ప్రారంభించారు. నాయకులు ప్రవీణ్, అమర్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు, అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

ఆమనగల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. కేఎన్‌ఆర్ సేవాదల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్‌బాబ, నాయకులు సురేందర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



దళిత రత్న అవార్డు అందుకున్న మల్లేశం, నర్సింహ

దళితులు అన్ని రంగాల్లో రాణించాలి

శంకర్‌పల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): దళితులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజన్న అన్నారు. బేడ, బుడగ జంగం హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల రాజలింగంతో కలిసి ఆయన శనివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకర్‌పల్లికి చెందిన కడమంచి మల్లేశం, తూర్పాటి నర్సింహలకు దళితరత్న అవార్డులను అందజేశారు. 20ఏళ్ల నుంచి ఎస్సీ వర్గకరణ కోసం పోరాటం చేస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలుచేయడం సంతోషకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో రఘు, సిద్ధయ్య, భీమయ్య, సాయిలు పాల్గొన్నారు.



కాగ్నా నదిపై బ్రిడ్జి నిర్మిస్తున్న చోట పారుతున్న వర్షపు నీరు

బ్రిడ్జి పనులతో రాకపోకలకు అంతరాయం

- వర్షాలతో కాగ్నా నదిలో పారుతున్న నీరు
- బొంకూరు-బిజ్వార్ మధ్య నిలిచిన రవాణా
- తాత్కాలిక దారి వేయాలని కోరుతున్న స్థానికులు

తాండూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంకూరు-బిజ్వార్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల మధ్య కొన్ని రోజులుగా బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. రాకపోకల కోసం కొంత దారి వదిలి పనులు చేస్తున్నారు. అయితే మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న చెదురుమదురు వర్షాలకు కాగ్నా నదిలో నీరు పారుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షాలతో పిల్లర్ల గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వారం రోజుల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచాయి. రెండు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతున్నందున కాంట్రాక్టర్ తమకు రాకపోకలకు తాత్కాలికంగా వేరే దారి వేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. బొంకూరు వాసులు చుట్టూ తిరిగి రుక్మాపూర్ మీదుగా రావాలంటే పొలాల్లోని రేగడి మట్టితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రాకపోకలకు మార్గం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిశ్చితార్థ వేడుకలో సీఎం



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ పరిధిలో గల ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన నిశ్చితార్థ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్, జగదీశ్వరిల కుమారుడు పవన్ రాజ్, ఏపీలోని ఏలూరుకు చెందిన వ్యాపారవేత్త చిరంజీవి, శ్రీదేవిల కుమార్తె సాయిశ్రుతిల నిశ్చితార్థం జరిగింది. దీనికి రాత్రి 8:30గంటల సమయంలో సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. కాబోయే వధూవరులకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి, మే 18(ఆంధ్రజ్యోతి)

అక్రమంగా ఫిల్టర్ ఇసుక దందా

రాత్రింబవళ్లూ తరలింపు

- గ్రామాల్లో భారీగా ఇసుక డంప్‌లు
- పట్టించుకోని అధికారులు

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసుల సహాయంతో నిఘా పెంచుతాం. ఇసుక, మట్టి రవాణా చేసే వాహనాలు, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. తమ గ్రామంలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే స్థానికులు మాకు సమాచారం ఇవ్వాలి. మా సిబ్బందితో కూడా గ్రామాల్లో తనిఖీలు చేపడతాం.

- జగదీశ్వర్, తహసీల్దార్, జిల్లేడ్ చౌదరిగూడ

చౌదరిగూడ, మే 18(ఆంధ్రజ్యోతి): ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ, పలు తండాల్లో పొలాల నుంచి మట్టి తవ్వి నీటి ప్రెషర్‌తో ఇసుక తీసి రాత్రింబవళ్లు ఇసుక రవాణా చేస్తున్నారు. గ్రామ శివారులో చాలా చోట్ల ఇసుక, మట్టి కుప్పలు కన్పిస్తున్నాయి. అసైన్డ్, పట్టా భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వి ట్రాక్టర్‌లో బోర్ పైపు వేసి సారవంత మట్టి పోయేంత వరకు నీటిని పంప్ చేస్తూ ఇసుక తయారు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఫిల్టర్ ఇసుకతో నిర్మాణాల్లో నాణ్యత ఉండదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్క ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి 5వేల వరకు తీసుకుంటున్నారు. తెల్లవారు జామున 4గంటల సమయంలో ఇసుక తరలింపు ట్రాక్టర్ల డ్రైవర్లు వాహనాల లైట్లు ఆఫ్‌చేసి ఇసుకను తరలిస్తున్నారు. కళ్లముందే ఇలా ఇసుక దందా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



ఇసుక ఫిల్టర్ కోసం ఏర్పాటు చేసిన బోర్ పైపులైన్



గాలిగూడ శివారులో డంప్ చేసిన మట్టి కుప్పలు

వాగులు, వంకల్లో ఇసుక ఫిల్టర్లు

వాగులు, వంకలు, చెరువు ప్రదేశాల్లో, ప్రైవేట్ భూముల్లో ఇసుక ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. ఇక్కత తయారు చేసిన ఇసుకను రాత్రి వేళ తరలిస్తున్నారు. ఇలా భారీగా మట్టి తవ్వకాలతో చెరువులు, ప్రైవేట్ భూముల్లో భారీ గోతులు ఏర్పడి వాటిల్లో నీరునిండి కొన్నిసార్లు ప్రమాదాలకు కారణం అవుతున్నారు. పిల్లలు, ఈత రాని వారు, కొన్నిసార్లు పశువులు వాటిల్లో పడి చనిపోతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై ఎస్సై విజయ్ స్పందిస్తూ.. ఇసుక ఫిల్టర్లపై తమకు సమాచారం లేదని, గ్రామస్తులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



సులోచనాకృష్ణారెడ్డి, చైర్‌పర్సన్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ

షాద్‌నగర్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతుధర పొందాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.సులోచనాకృష్ణారెడ్డి కోరారు. వర్షాలు కురుస్తున్నాయన్న భయంతో రైతులు పచ్చి ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారని తెలిపారు. మద్దతు ధరను కల్పిస్తూ, సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ కొనుగోలు కేంద్రాల్లో ఇస్తున్నామని చెప్పారు. షాద్‌నగర్ మార్కెట్ యార్డు పరిధిలో షాద్‌నగర్, కొత్తపేట, కొందుర్గు, చౌదరిగూడ, పెద్దఎల్కిచర్ల, ఎదిర, జాకారం, ముట్పూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అవసరమైతే మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టి, 17శాతంలోపు తేమ ఉండేలా ఎండబోయాలని సూచించారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులు వ్యవసాయశాఖ అధికారుల నుంచి టోకెన్, పట్టా పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు తేవాలని సూచించారు. అలాగే షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో టెండర్లు వేయని వ్యాపారులకు ధాన్యం విక్రయించొద్దని కోరారు.



బాధితుడికి ఆర్థిక సాయం

షాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్దార్ నగర్ గ్రామానికి చెందిన కూర శివ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో వెన్నుముక, నాడీ వ్యవస్థ దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర హాకీ చైర్మన్ కొండా విజ య్‌కుమార్ స్పందించారు. ఆదివారం శివ కుటుంబ సభ్యులను కలిసి విజయ్‌కుమార్ రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. బొబ్బిలి ప్రవీణ్, మల్లికార్జున్, ప్రదీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సమస్యల పరిష్కారమేది?

- గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ గ్రామానికైనా కొత్తగా రోడ్డు వేసిన దాఖలాలు ఉంటే చూపాలని మండిపడ్డారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల-సర్దార్‌నగర్ రోడ్డును స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణ పనులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 4 కోట్లు విడుదల చేస్తే.. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తుక్కుగూడ మున్సిపల్ అధికారులతో మాట్లాడి త్వరలో ఈ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే చేయాలని, అభివృద్ధిని అడ్డుకునేందుకు చేయొద్దని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిగల్ల రత్నం, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, సుమన్, సామేల్ రాజు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



రావిర్యాల-సర్దార్‌నగర్ గ్రామాల మధ్య రోడ్డును ఎమ్మెల్యే పరిశీలిస్తున్న సబితారెడ్డి



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు హబీబ్ లాల

ఊపందుకున్న తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులు

తాండూరు, మే 18(ఆంధ్రజ్యోతి): మధ్యలో నిలిచిన తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా ఈ రోడ్డు పనులు ఉధృతంగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో ఇది ప్రధాన రోడ్డు. నెల రోజుల కింద ఈ రోడ్డు పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించినా పనులు చేపట్టలేదు. కొంత కాలంగా వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు దుమ్ము, ధూళి, గుంతలతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ తాండూరు పట్టణాధ్యక్షుడు హబీబ్‌లాల పరిశీలించారు. ఈ రోడ్డు పనులకు ప్రభుత్వం గత డిసెంబర్‌లో రూ.110కోట్లు కేటాయించింది. ఈ రోడ్డు పూర్తయితే తాండూరు-వికారాబాద్ పట్టణాల మధ్య ప్రయాణించే వాహనదారులకు, పెద్దేముల్ మండలం మంబాపూర్, కందనెల్లి, మంచన్‌పల్లి, ధారూర్ గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే 45 నిమిషాల్లో వికారాబాద్‌కు చేరుకోవచ్చు.

న్యామతాపూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కడ్తాల్, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి న్యామతాపూర్‌లో కొత్తగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల వేడుకలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. న్యామతాపూర్, సమీప గ్రామాల భక్తులు వేడుకలకు తరలివచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్‌యాదవ్, చల్లా వంశీచంద్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీలు ఉప్పల వెంకటేశ్, దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా, నాయకులు, ఉత్సవ నిర్వాహకులు మహేశ్, రాములు, జాన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్, జంగయ్య, శ్రీశైలం, సత్యనారాయణ, చేగూరి వెంకటేశ్, జహంగీర్ అలీ, డాక్టర్ శ్రీనివాస్, బాల్‌రాజ్, విఠలయ్యగౌడ్, శంకర్, షాబుద్దీన్, లక్ష్మీనారాయణ, ఫారూఖ్, సమీర్, రమేశ్ గౌడ్, పారేశ, ఇర్ఫద్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే పర్యాటక ప్రాంతాలు, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వంతోడ్పాటు అందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. న్యామతాపూర్‌లో ఆదివారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

రూ.20వేల విరాళం: పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాత గీత రూ.20వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఉప్పల వెంకటేశ్, గంప వెంకటేశ్, దశరథ్‌నాయక్



ప్రతిష్ఠించిన బసవన్న, శివలింగ

బసవన్న, శివలింగం పునఃప్రతిష్ఠోత్సవం

తాండూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): చెట్ల పొదల్లో కూరుకుపోయిన బసవన్న విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అంతారంలోని మైసమ్మకట్ట సమీపంలో పురాతన బసవన్న విగ్రహం పొదల్లో కూరుకుపోయింది. దీంతో తాండూరుకు చెందిన గూళి శివకుమార్‌స్వామి, పరమేశ్వరస్వామి కుటుంబీకులు బసవన్నను పునఃప్రతిష్ఠ చేయించారు. గత మూడు రోజుల పాటు పూజలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం బసవన్న, శివలింగం ప్రతిష్ఠాపనను పూర్తి చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వడ్డె చంద్రయ్య, మాజీ సర్పంచ్ రాములు, విజయేందర్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌రెడ్డి, కుర్వ శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటయ్య, భద్రేశ్వర్, బసప్ప పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి యజ్ఞపూజలు

శామీర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నాల్ పరిధిలో ఆదివారం అనాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి మహాయజ్ఞ పూజలను ప్రారంభించారు. పూజలను సిద్ధయోగి ఆదినారాయణన్ ఆధ్వర్యంలో అనంతలక్ష్మి, నందగిరి మహరాజ్, వేద పండితులు ప్రారంభించారు. ఈ యజ్ఞ పూజలను 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆదినారాయణన్ స్వామీజీ తెలిపారు. కార్యక్రమాన్ని భక్తులు మంజుకేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డిలు ఆర్గనైజ్ చేశారు. శామీర్‌పేట ప్యాక్స్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ యోగా మాస్టర్ కిశోర్, నాయకుడు సతీష్‌రెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



పూజలను ప్రారంభిస్తున్న సిద్ధయోగి ఆదినారాయణన్, వేద పండితులు

- సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంల బదిలీ
- ఆరోగ్య కేంద్రాల్లో పెరుగుతున్న ఖాళీలు
- వైద్య సేవలకు ఆటంకం

ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు!



నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

ధారూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో పనిచేస్తున్న సబ్‌సెంటర్ల ఏఎన్‌ఎంలు పైరవీలు చేసి డిప్యుటేషన్లపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో ఆయా సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంల పోస్టులు ఖాళీ అయి వైద్యసేవలు సక్రమంగా అందడంలేదు. వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేసి వీరంతా తమకు అనుకూలమైన చోట్లకు డిప్యుటేషన్ ఆర్డర్లు తెచ్చుకున్నట్లు ఆశాఖ ఉద్యోగుల్లో ప్రచారం సాగుతోంది. ఇష్టానుసారంగా జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు డిప్యుటేషన్లు ఇవ్వటంతో పీహెచ్‌సీ పరిధిలోని సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీ అయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పీహెచ్‌సీ పరిధిలోని తరిగోపుల సబ్‌సెంటర్‌లో ఫస్ట్ ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న విజయనిర్మలను వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ఆస్పత్రికి, కుక్కింద సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న మహబూబ్‌బీని తాండూర్ అర్బన్‌లోని జీన్‌గుర్తి పీహెచ్‌సీకి, రెండో ఏఎన్‌ఎం అంజలిని ధారూరు పీహెచ్‌సీకి డిప్యుటేషన్ ఇచ్చారు. దీంతో కుక్కింద సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా మారాయి. అక్కడ ఎంఎల్ హెచ్‌పీని నియమించినా ఆమె ఇమ్యూనైజేషన్ చేయడానికి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అడ్డగోలుగా డిప్యుటేషన్లు ఇవ్వడం వల్ల సబ్‌సెంటర్లలో సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా కేరెల్లి సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, ఫస్ట్ ఏఎన్‌ఎంను నాగసమందర్ పీహెచ్‌సీలో ఔట్‌పేషంట్ విభాగంలో నియమించారు. దీంతో ఈ సబ్‌సెంటర్‌లో సెకండ్ ఏఎన్‌ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఓ అధికారి నిర్వాకం వల్ల పీహెచ్‌సీలో వైద్యసేవలు అస్తవ్యస్తంగా మారినట్లు ప్రచారం సాగుతోంది. అప్పుడప్పుడు విధులకు వచ్చే ఈ అధికారి ఆస్పత్రి సిబ్బంది మధ్య తగాదాలు పెట్టి గ్రూపులుగా విడగొట్టడం వల్ల సిబ్బంది మధ్య గొడవలు మొదలైనట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

నాగసమందర్ పీహెచ్‌సీలోనూ ఖాళీలు

నాగసమందర్ పీహెచ్‌సీలోనూ ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వైద్యాధికారి, ఫార్మసిస్టు, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా ఆమె కొన్నిరోజులు విధులు నిర్వహించి విముఖత వ్యక్తం చేయడంతో కోట్‌పల్లి వైద్యాధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన బాధ్యతలు చేపట్టేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఘట్‌కేసర్, మే 18 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ యువకుడు కృషిచేయాలని డాక్టర్ ప్రకాష్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు ఉన్నత విద్యతోనే సాధ్యమని చాటిచెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అని గుర్తుచేశారు. ప్రధానంగా యువత విద్యలో రాణిస్తూ ఇటు కుటుంబాలకు, ఆటు దేశానికి సేవచేయాలన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ చేపట్టిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్‌కుమార్, శ్రీనివాస్, సత్యం, రామేశ్వర్, అంజయ్య, జగదీష్, ఉపేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాలు, తండాల అభివృద్ధి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, తండాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఈర్లపల్లి నుంచి మైసమ్మ గడ్డతండా వరకు ఆదివారం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. రూ.కోటీ 30లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ వెంకటయ్యగౌడ్, సీతారాంనాయక్, పులిందర్‌రెడ్డి, నర్సింహులుయాదవ్, రవినాయక్, రామాంజనేయులు, మొగులయ్య, మల్లేశం, కృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు


హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలతో ఎమ్మెల్యే

దోమ, మే 18 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గానికి చెందిన 22 మంది ముస్లింలు హజ్ యాత్రకు బయలుదేరడంతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో ఆదివారం వారిని ఎమ్మెల్యే కలిశారు. యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

రామ మందిర పునర్నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ, స్థానికులు

తాండూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం ఇందిరానగర్‌లోని రామ మందిర పునర్నిర్మాణానికి ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మే 30వ తేదీన ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పునర్నిర్మాణానికి ఒక్కొక్కరు రూ.50వేలు విరాళంగా ప్రకటించారు. ఇందిరానగర్‌కు చెందిన గోపివెల్డర్ రూ.50వేల నగదును అందజేశారు. బాలాజీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ రూ.2లక్షలు అందజేస్తానని ప్రకటించారు.


పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మహ్మద్ అఫ్జల్‌ఖాన్

శామీర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆకలితో అలమటిస్తున్న పేదల ఆకలి తీర్చడమే ధ్యేయమని అఫ్జల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్ అన్నాడు. శామీర్‌పేటలోని అఫ్జల్‌ఖాన్ నివాసంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన అఫ్జల్‌ఖాన్ ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించాడు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ తాను మానవతా దృక్పథంతో అఫ్జల్ ఫౌండేషన్ ద్వారా పేదలకు ప్రతీ ఆదివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



దుద్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతులు పంటలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంట పొలాలు దుక్కి దున్ని విత్తనాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు గానూ రైతులు జాగ్రత్తలు పాటించాలని కొడంగల్ వ్యవసాయ శాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటల దిగుబడి విత్తనాల ఎంపికపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే తేరుకోలేని నష్టాన్ని చూడాల్సి వస్తుందంటున్నారు. ఏది మంచిదో, ఏది నకిలిదో అర్థం కాని విధంగా విత్తనాల ప్యాకెట్లు ఉంటున్నాయని పేర్కొంటున్నారు. విత్తనాల బెడద రైతులకు సవాల్‌గా మారింది. కొందరు కేటుగాళ్ల కారణంగా ఆరుగాలం కష్టించి అరక దున్ని విత్తనాలు వేసిన అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులు అప్రమత్తంగా ఉంటూ సాగు మొదలుపెట్టాలి. ఏదో ఒక విత్తనాలు కొనుగోలు చేసి దుక్కిలో వేసుకుంటే అవి మొలకలు రాక, అదును దాటిపోయి ఆ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకమే కావొచ్చు.

మాయ మాటలు నమ్మొద్దు

వర్షాలు కురిస్తే చాలు రైతుల్లో హడవుడి మొదలవుతుంది. రోహిణి కార్తెలో విత్తనాల కోసం రైతులు విత్తన డీలర్ల దుకాణాల దగ్గరికి పరుగులు తీస్తారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తన డీలర్లు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు తగు సూచనలు చేస్తున్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించిన రశీదులు దుకాణాదారుడి నుంచి తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలి. పంట యొక్క దిగుబడి వచ్చే వరకూ, పంట కాలం అయిపోయే వరకూ బిల్లు రైతుదగ్గరే భద్రపర్చుకోవాలి. తీసుకున్న బిల్లుపై విత్తనకంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్‌నంబరు, లాట్ నంబరు, ధర ఉండాలి. విత్తన ప్యాకెట్‌పై తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీలు సరిగా ఉన్నాయా లేదో సరిచూసుకోవాలి. విత్తనసంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్న, తడిసినా కొనుగోలు చేయొద్దు. విత్తనప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి. బిల్లులపై దుకాణం ముద్ర ఉండాలి. లూజ్‌విత్తనాలు కొనుగోలు చేయొద్దు. లైసెన్స్ దుకాణం ముద్ర ఉండేలా చూసుకోవాలి. లైసెన్స్ కలిగిన దుకాణాదారుల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలి.

సమాచారం అందించాలి



పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి తీసుకొచ్చి తక్కువ ధర అంటూ విత్తనాలు అమ్మితే అవి నకిలీ విత్తనాలు అని గుర్తించాలి. గ్రామాల్లో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మే వారి వివరాలు అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలి. పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

- సాదుల నాగరాజు, వ్యవసాయ శాఖ అధికారి, దుద్యాల

అన్నదాతకు 'అకాల' కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

తూకం వేసి కేంద్రం వద్దే నిల్వ ఉంచడంతో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మెట్లకుంట, బొంరాస్‌పేట్, బురాన్‌పూర్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని తూకం వేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

అధికారులు వచ్చినప్పుడే హడావుడి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ పర్యటన ఉండటంతో శుక్రవారం ఒక్కో కేంద్రం దగ్గర గన్నీ బ్యాగులు, లారీలు ముందస్తుగా తెచ్చారు. బొంరాస్‌పేట్‌లో రాష్ట్ర స్థాయి అధికారుల పర్యటన సందర్భంగా లారీలు వచ్చాయి. తిరిగి ఒక్క లారీ కూడా రాలేదు. తూకం వేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రాలకు పోటెత్తిన ధాన్యం

ఈసారి యాసంగి సీజన్‌కు సంబంధించి బషీరాబాద్ మండలంలో అంచనాను మించి ధాన్యం దిగుబడి వచ్చింది. ఇదే తరహాలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తోంది. అంచనాలకు మించి ధాన్యం రావడం, మరోపక్క హమాలీల కొరతతో కాంటాలు ఆలస్యంగా మొదలుపెట్టారు. సకాలంలో కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోళ్లు జరుగక ధాన్యం కుప్పలు, బస్తాలతో కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. దీంతో వారాల తరబడి కేంద్రాల్లో నిరీక్షించాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు సాయంత్రం అయితే ఉరుములు, మెరుపులతో అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆగమాగం అవుతున్నాడు.

జాప్యంతో జగడం!

కాంటా వేయడంలో జరిగిన జాప్యంతో ఒకేసారి రైతుల నుంచి కేంద్రాల వద్ద ఒత్తిడి పెరిగింది. పెద్ద మొత్తంలో ధాన్యం కేంద్రాలకు తరలివచ్చింది. దీంతో కాంటాలు సక్రమంగా జరిగే పరిస్థితి లేక రైతులు, నిర్వాహకులు నానా తంటాలు పడుతున్నారు. మరోపక్క గన్నీ సంచులు అరకొరగా రావడంతో రైతులు ఎగబడి తీసుకెళ్తున్నారు. నిత్యం కేంద్రాల నిర్వాహకులతో రైతులు గొడవలకు దిగుతున్నారు. మైల్వార్ కేంద్రం వద్ద స్థలభావంతో తారు రోడ్డుపై కిలోమీటరు పొడవునా ధాన్యం ఆరబోశారు. దీంతో రకపోకలకు ఇబ్బందిగా మారడటంతో వాహనదారులు, రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పర్యవేక్షణకు కేంద్రాలకు వచ్చే అధికారులతో రైతన్నలు గోడు వెళ్లబోసుకుంటున్నా కొనుగోళ్లు అంతంతమాత్రమే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి లారీలు రాకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం అధికారులకు సవాల్‌గా మారింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తూకాలను వేగవంతం చేయాలని కోరుతున్నారు.


బషీరాబాద్: మైల్వార్ కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్(ఫైల్)

దళిత యువకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

యాలాల, మే 18 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిపై దౌర్జన్యం చేసి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. యాలాల మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కోకట్ గ్రామానికి చెందిన మస్త అంజిలప్ప సర్వేనెంబర్ 183లో తన ఐదెకరాల భూమిలో ఆదివారం కల్టివేటర్‌తో దున్నుతుండగా, కొందరు రెడ్డి కులస్తులు పొలం వద్దకు వచ్చి తమ గట్టు దున్నుతావా? అంటూ దుర్భాషలాడారని తెలిపారు. కోకట్‌కు చెందిన కయ్యం పురుషోత్తంరెడ్డి, బబ్లురెడ్డి ఇద్దరూ కలిసి అంజిలప్పపై అకారణంగా దౌర్జన్యం చేస్తూ విచక్షణారహితంగా దాడి చేశారని అన్నారు. గతంలోనూ వీరు అంజిలప్ప కుటుంబంపై దాడి చేశారని అన్నారు. వీరు రాజకీయ పలుకుబడితో దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కేవీపీఎస్ ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాస్నం రామచందర్, కోళ్ల వెంకటయ్య, గురు, చిన్న అనంతయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

మోమిన్‌పేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే సీఐటీయూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆదివారం మోమిన్‌పేట్ మండలంలో విడుదల చేశారు. కార్తికేయ వాల్ట్ గ్రీన్ తదితర కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కంపెనీల్లో కనీసవేతనాలు అమలుచేయడం లేదని, యజమాన్యాలు కార్మికులతో 12గంటలు పని చేయించుకోవడం సరికాదన్నారు. మంగళవారం జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మాసయ్య, బాబు, ఆనందం, కార్మికులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చీర కొంగు చక్రంలో ఇరుక్కొని.. బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

కేశంపేట, మే 18(ఆంధ్రజ్యోతి): చీర కొంగు చక్రంలో ఇరుక్కోవడంతో బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మంగళగూడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన పో రండ్ల బాలమణి(40) ఆదివారం తన కూతురుతో కలిసి మండల పరిధిలోని నిర్ధవెల్లిలోని బంధువుల ఇంటికి బయలుదేరింది. గ్రా మం మీదుగా ఓ వ్యక్తి బైక్ వెళ్తుంటే లిఫ్ట్ అడిగి తన కూతురుతో పాటు తాను కూడా బైక్ ఎక్కింది. మార్గమధ్యలో కొత్తపేట శివారులో చీర కొంగు వెనుక చక్రంలో ఇరుక్కోవడంతో బాలమణి కిందపడిపోయింది. తల రోడ్డుకు తాకడంతో బలమైనగాయమై తీవ్ర రక్తస్రావమైంది. 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బాలమణిని షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. మృతురాలికి భర్త యాదయ్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన విషయం తెలిసిందని, విచారణ చేపట్టామని కేశంపేట సీఐ నరహరి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


రాజుతంతి

శంషాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం శంషాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజుతంతి (42) కవేలీగూడలోని ఓ ఫాంహౌజ్‌కు వచ్చి సెక్యూరిటీగార్డుగా ఉద్యోగం చేస్తూ అక్కడే ఓ గదిలో నివాసముంటున్నాడు. అతనికి అన్న వరుస అయిన రాజేష్ కూడా అక్కడే పనిచేస్తున్నాడు. రాజు తంతి ఈనెల 12వ తేదీన ఎవ్వరికీ చెప్పకుండా ఇంటికి తాళంవేసి బయలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ దొరక్కపోవడంతో రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

రుణ లక్ష్యం రూ.553.45 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

రుణాల మంజూరులో ప్రాధాన్యం ఇస్తూ రుణాలు మంజూరు చేస్తున్నారు. సంఘాలే కాకుండా వ్యక్తిగతంగా కూడా సభ్యులు రూ.5 లక్షల వరకు రుణం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఏ వ్యాపారం కోసం తీసుకుంటున్నారనేది తెలియజేయాల్సి ఉంటుంది.

గతేడాది రూ.545.90కోట్ల రుణాలు

2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 13,139 స్వయం సహాయక సంఘాలకు రూ.554.51 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని లక్ష్యం నిర్దేశించగా, 6,066 సంఘాలకు రూ.545.90 కోట్లు రుణాలు పంపిణీ చేశారు. నిర్దేశించిన రుణ పంపిణీ లక్ష్యంలో జిల్లా 98.45 శాతం అధిగమించింది. గతేడాది జిల్లాలో అత్యధికంగా 993 సంఘాలకు రూ.41.10 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, అత్యల్పంగా చౌడాపూర్ మండలంలో 216 సంఘాలకు రూ.8.54 కోట్లు పంపిణీ చేశారు.

మండలాల వారీగా రుణ పంపిణీ లక్ష్యం

మండలం	సంఘాలు	రుణం(రూ.లక్షల్లో)
బంట్వారం	370	1,540.01
బషీరాబాద్	740	3,213.04
బొంరాస్‌పేట్	730	3,299.67
చౌడాపూర్	459	1,976.80
ధారూరు	528	2,321.84
దోమ	970	4,273.08
దౌల్తాబాద్	652	2,952.48
కొడంగల్	513	2,232.30
కోట్‌పల్లి	408	1,742.67
కులకచర్ల	864	3,847.72
మర్పల్లి	832	3,674.69
మోమిన్‌పేట్	723	3,188.97
నవాబ్‌పేట్	712	3,153.79
పరిగి	715	3,124.76
పెద్దేముల్	691	3,057.82
పూడూరు	646	2,791.08
తాండూరు	865	3,745.14
వికారాబాద్	403	1,774.15
యాలాల్	795	3,435.06
మొత్తం	12,616	55,345.08

ఐటీ పార్కుకు పునాది పడేనా?

(ఐదో పేజీ తరువాయి)

కూడా పనులు చేపట్టకపోవడంతో ఐటీ పార్కు ఇక్కడి నుంచి తరలిపోతున్నదని పెద్దఎత్తున ప్రజల్లో అపోహలు నెలకొన్నాయి.

గోదాములను కూలగొట్టి మరీ..

నగరానికి ఉత్తరాన మేడ్చల్ వైపు కూడా ఐటీ విస్తరిస్తుందని అందరూ భావించారు. కాని ఐటీ పార్కు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారాయి. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలంలో గేట్ వే ఐటీ పార్కు నిర్మాణం కోసం 2022 ఫిబ్రవరి 17న అప్పటి సీఎం కేసీఆర్ జన్మదినం రోజున ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఓఆర్ఆర్ పక్కనే సర్వే నంబర్ 125లో దాదాపు పదెకరాల విస్తీర్ణంలో గేట్ వే ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం మార్కెట్ కమిటీ స్థలంలో ఉన్న భారీ గోదాములను జేసీబీలతో కూల్చివేశారు. స్క్రాబ్‌కు కూడా పనికిరాకుండా నేలమట్టం చేశారు. టీఎస్ఐఐసీ అధికారులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అప్పట్లో మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా ప్రతిరోజూ స్థలాన్ని పరిశీలిస్తూ పనులపై ఆరా తీశారు. హంగూ.. ఆర్భాటంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు పరిశ్రమల వారికి ఐటీ పార్కులో స్థలాలను కేటాయిస్తూ పత్రాలను కూడా అందజేశారు. ఇంత హడావుడి చేసి మూడు సంవత్సరాలైనా పనులు ప్రారంభం కాకపోవడం పట్ల స్థానికులు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ టోర్నీని ప్రారంబిస్తున్న నరేశ్ గౌడ్

కద్గాల్, మే 18(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి దోహదపడుతాయని రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు గంట నరేశ్‌గౌడ్ అన్నారు. కద్గాల మండలం ముద్విన్ గ్రామంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. రమణమోని స్నేహ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను నరేశ్‌గౌడ్ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రమణమోని రమేశ్, రెండవ బహుమతి పుట్టి శ్రీనులు సమకూర్చారు. శ్రీశైలం, శివ, ప్రవీణ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలకు నృసింహస్వామి ఆలయం ముస్తాబు

తలకొండపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. నేటి(సోమవారం)నుంచి మూడు రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకుడు, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మంజుల దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం గణపతిపూజ, గోపూజ, స్వస్తిహవాచనం, అగ్నిప్రతిష్ఠ, తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి


కాస్లాబాద్ బీసీ సేన మహిళా కమిటీతో జయ

చౌదరిగూడ, మే 18(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం అందరూ సమిష్టిగా పోరాడాలని బీసీసేన జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షురాలు ప్యాట జయ అన్నారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల, కాస్లాబాద్ గ్రామాల్లో బీసీసేన నూతన మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు కేవలం బీసీలను ఓటు బ్యాంకు కోసం ఉపయోగించుకుంటోందని, దేశానికి స్వాతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా బీసీల తలరాతలు మారడం లేదన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్దఎల్కిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా గుడిసే శోభారాణి, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంజుల, కాస్లాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా సుజాతలతో పాటు కొంతమంది మహిళలను సభ్యులను ఎన్నుకున్నారు. బీసీ సేన నాయకులు శేఖర్, భాగ్యలక్ష్మి, ప్రశాంత్, బాల్‌రాజ్, శ్రీకాంత్ తదతరులు పాల్గొన్నారు.